నోటీసు చదువుకోగానే మనసొకసారి సంబరపడింది—నేను ఈ ఆఫీసులో చేరాక, కంపెనీ మీటింగ్‌కు వెళ్ళటం జరగలేదు. 'ఈసారి శనివారం సాయంత్రం కంపెనీ సర్వసభ్య సమావేశం వుంది. మీరు రావాలి. అందులో ఫలానా ఫలానా అంశాలన్నీ చర్చించబడతాయి. ఇట్లు కార్యదర్శి'– అని ఉంది నాకిచ్చిన నోటీసులో.

కంపెనీ అంటే–ఏదో వ్యాపార సంస్థ అనుకుంటే పొరబడ్డట్లేమరి. ఆఫీసులో వుండే వాళ్ళందరూ వాళ్ళ వ్యక్తిగత



# మరో బుద్ధకొండ

పి. సత్యనారాయణరెడ్డి

శ్రేయస్సుతోబాటుగా సామూహిక ఉన్నతికోసం కలిసిస్థాపించుకున్న సంస్థ ఇది.

ఈ కంపెనీలో నాకు మొదటి పరిచయం ఆఫీసులో చేరిన వారంరోజులకే జరిగింది - ఆ రోజున నేను నా సీట్లో కూర్చుని పనిచేసుకుంటూంటే చేతిలో కొన్ని పత్రాలతో వచ్చా డొకతను. అతని వెనుక కొంతమంది-

"ఏమండీ..."

నా చేతికి అందించిన కాగితం చదివాను. 'మీవోటు ఫలానావారికేఇవ్వండి, మీ సేవకు మాకు అవకాశం ఇవ్వండి'- బాగుంది. పదిమంది కోసం పాటుపడతా నంటూన్న వ్యక్తి ఇతను. నాకెంతో సంతోషమే కలిగించి. అయినా దురదృష్టవంతుణ్ణి-నేను ఇంకా ఆ కంపెనీ ఏదో దాంట్లో చేరలేదు. చేరాక కదా ఓటుహక్కు!

అదే అన్నాను.

నవ్వాడు అతను. నా చేతిలో కాగితం లాగేసుకొంటూ అన్నాడు - "పోనీ లెండి! మీ స్నేహితుడికయినా చెప్పండి!"

"తప్పకుండానూ! మీలా సేవచేస్తామని ఎంతమంది వస్తారో చెప్పండి?" అన్నాను ఆతని మీద అపార గౌరవంతో.

అతను నాకేసి అదోలా చూశాడు. తర్వాత వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఒక వారం రోజులు ఆఫీసు అంతా అదో రకమైన అల్లరి, అలజడి, ఆక్టివిటీలతో నిండిపోయింది. ఒక చిన్న ఆఫీసులో చిన్న కంపెనీకి ఇంత మంది సేవ చేస్తామంటూ బయలుదేరటం ఆశ్చర్యంగానే ఉంది.

ఎన్నికల రోజున చూస్తే, ఎపుడూ ఎన్నికలలో తిరిగే చేయితిరిగిన రాజకీయవేత్తలకే మతి పోతుందేమో నవిపించింది నాకు. లే. పోతే .... అయ్యబాబోయ్ - ఇంత హడావిడి .... ఇంత అట్టహాసం ... ఇంత కోలాహం ... ఇంతా చేసి వీళ్ళు ఈఎన్నికలో గెలిస్తే ఏమవుతారు? - ఏమీకారు, ఓ బుల్లి కంపెనీకి ఎక్జిక్యూటివ్ మెంబర్. అంతే!

దేశంలో ఉన్న ప్రజాస్వామ్యం తెచ్చిన సేవా పరాయణత్వం క్షణం-కాదు,ఆ రోజంతా - నన్ను కలవరపరిచింది.

ఇక ఆ రోజు రాత్రి ఎన్నికల ఫలితాలు రావడం, ఆ తర్వాత ఓ సర్వసభ్య సమావేశం జరగటం, అందులో పాతనీరు బదులు కొత్త నీరు రావటం జరిగింది. ఆ తర్వాతే నేనూ కంపెనీలో కొత్తగా సభ్యత్వం తీసుకొన్నాను.

సభ్యత్వం తీసుకొన్నట్లుగా వారు నా కిచ్చిన కాగితాలు చదువుకొంటే, దేశంలో అందరికీ ఇలాటి కంపెనీలే ఉంటే ఎంత బాగుంటుందో కదా అనీ

అనుకొన్నాము.

—ఆ తర్వాత ఇదే మళ్ళీ నాకు ఆహ్వానం సర్వసభ్య సమావేశానికి రమ్మంటూ.

—ఆ ఆహ్వానం అందుకోగనే గుర్తుకొచ్చిన గతం నా పెదవులమీదకో చిన్న చిరునవ్వును తెప్పించింది. నవ్వుతూ అడిగాడు వెంకటరావు"— "ఏమిటి విశేషం, మీలో మీరే నవ్వుకొంటున్నారు?" — అంటూ.

ఏమని చెప్పను సమాధానం?

నేనేమీ సమాధానం ఇవ్వకపోయే సరికి నా చేతిలో కాగితం చూశాడు. ఈసారి తనే అన్నాడు: "అయితే మీరు వెళుతున్నారా?"

తల ఊపాను.

"ఎందుకైనా మంచిది. కత్తులు, కటార్లు దగ్గరుంచుకోండి!"

"అంటే?" — ఆశ్చర్యంగా అడిగాను.

"మీరు వెళుతున్నది యుద్ధరంగానికి కాబట్టి ఆయుధాలు తీసుకెళ్ళమని అంటున్నాను."

నాకు నవ్వొచ్చింది — వెంకట్రావుకు ఇంకా తెలీదు — ఇందులో ఏముందిగనుక? అందరూ ఒక చోట కూర్చుని కష్టసుఖాలు చెప్పుకున్నట్లే ఇదీనూ!

పదిమందీ ఆలోచించి సంస్థ కూ సంస్థద్వారా మనకు ఏది మంచిదైతే అది అమలు చేసుకోవటమేగదా ఇది? ఇందులో యుద్ధం ఎక్కడుంటూంది?

అయినా యుద్ధం మంచిదే! — ఆశయాల యుద్ధం జరిగితే మనకు గలిగే మేలుగురించి మాటల్లో చెప్పుకోలేం.

నా మాటలు విని వెంకటరావు నవ్వాడు— "మీ ఇష్టం! ఇక్కడ పని చేస్తున్నవాణ్ణి చెబుతున్నాను. అదో యుద్ధ కాండ. అందుకే నేను ఆ ఛాయలకు కూడా పోను!"

—నాకు నవ్వుతో బాటుగా వెంకటరావు అమాయకత్వానికి, పిరికి తనానికి జాలి కలిగింది.

"మీరు మరీ ఇదిగా అనేస్తున్నారు. సర్వసభ్య సమావేశం అనగానే అందరూ కత్తులు కటార్లతోనే రావాలా, రమ్మనా మీ ఊహ?— అయినా ఇక్కడ పని చేసేది అందరు బా.గా చదువు కొన్న వాళ్ళేగదా!"

"నేను అలానే అనుకొన్నాను మొదట్లో - ఇప్పుడు నాకా అభిప్రాయం లేదు."

"అక్కడేమైనా ఇబ్బంది ఉంటే అందరికీ చెప్పి సరిచెయ్యాలి గానీ, ఇలా వెనక్కు రావటం అంత మంచి పద్ధతి కాదేమో!" అన్నాను వెంకటరావులో.

"మనిషిగా బతకాలనే కోరిక నాలో ఇంకా చావలేదండీ!"— అంటూ ఏదో జోకు వేసినట్లుగా నవ్వాడు వెంకటరావు.

నాకు ఒళ్ళు మండి పోయింది — ఈ

ఆఫీసు మనది. ఇక్కడ అంతా మన వాళ్ళు. వీళ్ళలో లోపాలు ఉంటే మనం చెప్పి సరిచెయ్యాలి కానీ ఇలా వాళ్లకు దూరంగా బతకాలి అంటే ఆ మూర్ఖత్వానికి జోహార్లు పలకాలే తప్ప ఇంకేమి చెయ్యలేము. మిగతా అందరి సంగతి ఏమోగానీ నేను అలా బతకలేను - నాకున్న చదువును సార్థకం చేసుకోవాలన్న తపన నాలో ప్రతిక్షణము నిండి ఉంటుంది. నేను చదివిన పాఠాలు పది మందికి చెప్పటమంటే నాకు తగని అభిలాష. నేను సైతం ఈ ప్రపంచానికి ఏ కొంచెం సాయపడ్డా చాలు, ఆ తృప్తితో బతుకంతా గడుపుకో గలను. అంతే కానీ—

ఇలా-కోటి మనుషులను చి పారిపోయి అమానుషంగా బతకటం నా చేత కానిపని.

శనివారం రానే వచ్చింది-వెంకటరావును కూడా బలవంతం చేసి సభకు లాక్కొచ్చాను.

ఈలోగా ఇద్దరు ముగ్గురు నా దగ్గర కొచ్చారు-తాము కంపెనీని ఏదో ఉద్ధరించుదా మనుకొంటే ఫలానా ఫలానా వ్యక్తులు అడ్డు పడుతున్నారనీ, దానికి రకరకాల కారణాలు ఉన్నాయని, అందులో కొన్ని చెప్పి మరీ వెళ్ళారు.

నాకు, నవ్వొచ్చింది - నేను చదువుకొన్నాను. అంతో ఇంతో స్వయంగా ఆలోచించగలను. కాని వీళ్ళు - నన్ను ఫలానా విధంగానే ఆలోచించాలని కోరటంలో ఎక్కడో కొంచెం అసమంజసంగా తోస్తోంది. అయినా - నిర్ణయం నాదే కదా !-

— ఆ ధైర్యంతోనే వెళ్ళాను -ఆ సమావేశానికి.

వేదిక మీద మూడు కుర్చీలు. కింద సభ్యులందరూ ఆసీనులు కావటానికి కొన్ని కుర్చీలు ఉన్నాయి.

అందరూ రాగానే ప్రార్థనతో ప్రారంభమైంది సభ. సభ అంతా నిశ్శబ్దంగా ఉంది-ఎక్కడో ఓ కుర్చీ కదిలిన శబ్దం తప్ప - కార్యదర్శి నివేదిక చదువుతున్నంత సేపు. కార్యదర్శి నివేదిక చదవటం అయిపోగానే ఒకతను లేచాడు—"ప్రతీసారి మీటింగ్‌కుముందు సభ్యులందరికి కాఫీ ఇచ్చేవారు. ఈసారి ఇవ్వకపోవటం .."

నాకెందుకో నవ్వొచ్చింది - సభ్యులందరూ తాగేది తలాఒక కప్పుకాఫీయే కదా! ఆ మాత్రం కాఫీ ఇవ్వక పోవటం మహాపరాధంగా అతను భావించటం. అయినా ఆ కాఫీ...కాఫీ అని ఎవరు పెట్టారు పేరు ఆ వేదినీళ్ళకు !-

"అవును ... అవును... అవును..." హాలు హాలంతా గోలయి పోయింది ఒక్కసారి.

ఒక్క కాఫీ ఎంత కల్లోలాన్ని సృష్టించిందో అని ఆశ్చర్యపోయాము - నాకేసి వెంకటరావు సాలోచనగా చూసి

నవ్వాడు నేనది పట్టించుకోలేదు.

కార్యదర్శి లేచి సవినయంగా జవాబిచ్చాడు—"కాఫీ ఈసారి సభ మధ్యలో ఇవ్వబడుతుంది. ఎందుకంటే కాఫీ ఇవ్వగానే చాలమంది వెళ్ళిపోవటం ప్రతిసారి జరుగుతున్నదే. ఈసారిదిన్ని అరికట్టాలని ..."

"సభకు అది అమర్యాద చేసినట్లు—" ఎవరో అన్నారు—

అంతే—ఇంకోసారి సభలో గోల.

"వీడెంత. వీడి కాఫీ ఎంత? దాని కోసం ఎంతమాటనేశాడు చూశారా?—" ఎవరో అన్నారు.

"కాఫీ కోసం ఎవరండీ కక్కుర్తి పడేది?"

"మీ రా మాట ఉపసంహరించుకోవాలి!—"

"సెక్రటరీ, విత్ డ్రా యువర్ రిమార్క్!"

"...." కార్యదర్శి లేచి నిలబడి అసహాయంగా అన్నాడు—"జరుగుతున్న సంగతి అదే అయినా అలా అనటం భావ్యం కాదు అంటున్నారు కాబట్టి నేనన్నది ఉపసంహరించుకొంటున్నాను!"

నాకు నవ్వొచ్చింది—ఏమిటిది?— ఒకే మాట ఇంకోవిధంగా అంటే ఊరుకొన్నారువీళ్లు—వీళ్ళకసలు ఆఊహ తట్టదా? లేకపోతే అసలు ఆలోచించరా? జరిగే సంగతిని జరుగుతోందని చెప్పటంలో తప్పెక్కడుందో నాకు అర్థంకాలేదు.

అందరూ చప్పట్లుకొట్టారు. మొదటిసారి తాము గెలిచామన్న సంతోషం అందరిలోనూ కనబడుతోంది. అయినా వీళ్ళ గెలుపు ఎవరిమీద? ఆ సంగతి ఆలోచించరేం?

గడియారంకేసి చూశాను. కాలాన్ని ఎవరో తరిమికొడుతున్నట్లుగా పరిగెడుతున్నాయి ముళ్లు రెండూ—అప్పటికే అరగంట గడిచిపోయింది.

కార్యదర్శి తాను చేసిన ఆ ఘోర అపరాధానికి ప్రాయశ్చిత్తంగా వెంటనే కాఫీ తెప్పించాడు. అందరూ ఆనందాన్ని ఆ కప్పుకాఫీలోంచి జుర్రుకొన్నారు. ఆ ఆనందాన్ని తామూ పంచుకోవాలనే కాంక్షతో కాబోలు కొన్ని కప్పులు హఠాత్తుగా, కొన్ని తమంత తాముగా, మరికొన్ని యజమానుల ఆజ్ఞ శిరసావహిస్తున్నట్లుగా నేలమీదపడి ఆనందంతో వెయ్యిముక్కలుగా మారిపోయాయి.

నాకెంతో కంపరంగా ఉంది.

వెంకటరావు అన్నది నిజమే అవబోతోందా? ఈ యుద్ధకాండలో నేనూ ఓ సైనికుణిగా మారాల్సివస్తుందా నాకు అర్థంకాలేదు.

నాతోబాటుగా నా ఆలోచనలూ గందరగోళంగా మారిపోతున్నాయి.

మళ్లీ ప్రారంభమైంది సభ. ఈసారి ఆడవాళ్లకు సరైన ప్రాతినిధ్యం లేదనీ, అందుకోసం ఆడవాళ్ల కోసం ప్రత్యేకించి ఒక మెంబర్ పదవిని కేటాయిం



# ప్రకృతి చికిత్స !

చాలనే దానిమీద చర్చ ప్రారంభమైంది.

కార్యదర్శి లేచి నెమ్మదిగా అన్నాడు: "సభ చర్చకోసం ఉన్న ఎజెండాలో మొదటి అంశం స్త్రీలకు ప్రత్యేక ప్రాతినిధ్యం. మన ఆఫీసులో అనేకమంది ఆడవారు ఉన్నారుగానీ, మనకంపెనీలో వారికి ప్రాతినిధ్యం లేకపోవటమే జరుగుతూంది. ఎపుడు ఎన్నికలైనా మగవారు నిలబడి గెలవటం జరుగుతోందే కానీ స్త్రీలు నిలబడటం కానీ, ఎన్నికవటంగానీ జరగటంలేదు. ఆడవారి క్షేమం దృష్టిలో ఉంచుకొని, మనం ఈసారి ఎన్నికలనుంచి మన కంపెనీలో ఆడవారికి ప్రత్యేకమైన ప్రాతినిధ్యం ఇవ్వాలని ఈ తీర్మానం శ్రీ రావుగారు ప్రవేశపెట్టారు- ఈ విషయమై ఏ సంగతీ ఎవరైనా మాట్లాడదలుచుకొంటే మాట్లాడొచ్చు."

వెంకటరావు నాతో అన్నాడు-ఇంతసేపూ చూసింది ఉపాఖ్యానం కథ. ఇప్పుడు ప్రారంభం కానున్నది అసలు ఘట్టం."

నేనేమీ అనలేకపోయాను.

ఇంతక్రితం జరిగిన ఆ కాఫీ సంఘటనతో నాలో కొంత మార్పు రానే వచ్చింది-చదువుకొన్న వాళ్లంటే వున్న

నమ్మకం కొంత సడలిపోయింది కూడాను! అయినా ఆశ! ఆశ చావటం లేదు.

—ఎవరో మైకుముందు నిలబడటంతో నా దృష్టి అటు మళ్ళింది.

—"అధ్యక్షా! మన ఆఫీసు చాల చిన్నది. అందులోనూ ఈ కంపెనీ మరీ చిన్నది. దేశం మొత్తంమీద ఎక్కడా అమలులో లేనివి ఇక్కడ అమలు చేయాల్సిన అవసరం ఏమిటో నా కర్థం కావటంలేదు. మీరు ఆలోచించండి— శ్రీ రావుగారు స్త్రీ పక్షపాతంతో—"

"స్త్రీ పక్షపాతం ఏమిటి?" ఎవరో అన్నారు సభ మధ్యలోంచి.

"అంటే ఆడవారంటే అభిమానం!" ఇంకెవరిదో జవాబు.

"అభిమానం మంచిదే లెండి!—" ఇంకెవరో విసిరిన చెణుకు.

"....స్త్రీలపట్ల అభిమానంతో ...." మళ్ళీ కొనసాగించబోయాడు ఆ మొదటి వ్యక్తి.

ఈసారి ఎవరో లేచారు గట్టిగా అరుస్తూ—అటుకేసి చూశాను - "అతనే శ్రీరావ్!" అన్నాడు వెంకటరావు.

"—మీ రంటున్నట్లుగా స్త్రీల పక్షపాతమూకాదు, అభిమానమూ కాదు."

"డు యూ మీన్ ఇటీజ్ లవ్?..." ఎవరో అడిగారు.

"మీ కెలా చెప్పాలి?"

"తెలుగులో...." ఇంకెవరో అన్న వాక్యం అది.

నాకు నవ్వొచ్చింది—స్త్రీలకు ప్రత్యేక ప్రాతినిధ్యం ఉండాలా వద్దా అనే విషయం వీళ్ళగాలికి వదిలేసి గంట అయిపోయింది. ఇంతకీ శ్రీరావుగారికి ఉన్నది స్త్రీలంటే అభిమానమా, జాలా, ప్రేమా, సానుభూతా అనే విషయం నిర్ణయం అయితేగానీ ఏమి జరిగేటట్లు లేదు. ఆ సంగతి శ్రీరావుగారే చెబితే బాగుండును. ఆయన నేలేచినపుడల్లా ఏదో ఇంకో కొత్తపదం, ఇంకొంచెం గొడవ. ఆయన చెప్పలేకపోవటం జరుగుతోంది. సభవారు ఇంకా ఏకాభిప్రాయానికి రాలేదు. ఎప్పటికి ఈ సభ ఏకాభిప్రాయానికి వస్తుందో ఏమో! — ఆ తర్వాతేగదా విషయ విచారణ!

నా ఆలోచనలు ఇలా సాగుతోంటే ఉన్నట్లుండి ఇంకో కలవరం చెల రేగింది—వెంకటరావు నడిగాను ఏం జరిగిందంటూ

నవ్వాడు — ఆ నవ్వులో వెయ్యి అర్థాలు, అర్థం చెప్పలేని బాధ.

"చెప్పండి ఏం జరిగిందో!"

వెంకటరావు చెప్పాడు - సభలో ఎవరో ఒకతనికి తెలుగులో జరిగే ఆ చర్చ అర్థంకావటం లేదుట. సభ్యుడిగా తన హక్కు- చర్చను అర్థంచేసుకోవటం కాబట్టి తన భాషలో చెప్పమంటాడుట అతను.

"కార్యదర్శి చెప్పచ్చుగదా పోనీ!" అన్నాను నేను కొంచెం సానుభూతితో.

"ఆయనకు అభాషరాదు!" అన్నాడు వెంకటరావు.

"పోనీ ఎవరినైనా వచ్చినవాళ్ళని

పిలిసే సరిపోతుందిగదా।"

నేను ఈమాట ఇంకా అనకముందే ఎవరోవచ్చి ఇంకో భాషలో చెప్పటం ప్రారంభించాడు అంతవరకూ జరిగిన చర్చంతా.

ఇంతలో ఇంకో ఉపద్రవం - మొదటి వ్యక్తి చెప్పినదానికీ ఈ అనువాదానికీ అసలు పొంతనే లేదంటూ।

ఎక్కడికి పోతోంది ఈ సభ ?

ఈ భాషాభేదం దేశమే పరిష్కారం ంచలేకపోయింది. ఇక ఈ చిన్న సభ ఎంత ?

ఎంతెంత మహామహులు చేయలేని న్యాయం వీళ్ళెక్కడ చేయగలరు ?

వీళ్ళకున్న సమయమెంత ? వీళ్ళకున్న సంపద ఎంత ? వీళ్ళకున్న సమస్యలు కొన్ని. ఆ సమస్యలకే పరిష్కారం కష్టమైపోతున్న క్షణాల్లో పులి మీద పుట్రలాగా ఈ భాషాభేదాలు ...

ఎవరికైనా ఏదీ అర్థంకాక పోతే పక్కవాడినడిగి తెలుసుకోవాలి. అంతే కానీ ఇలా ప్రతీ వాక్యానికీ ప్రతీ పదానికీ అనువాదం కావాలంటూ పేచీ పెడితే...అనువాదం చేస్తే ఆ అనువాదం తప్పని మరో మడతపేచీ ... అసలు సమస్య గాలికి కొట్టుకుపోయి...

నాకెందుకో మతిపోతోంది.

హాలంతా గోల-కేకలు...గంటక్రితం నిశ్శబ్దంగా కూర్చుని వున్న కుర్చీలన్నీ హడావుడిగా అటూ ఇటూ తిరగ సాగాయి.

కొత్త సమస్య ఒకటి పాత సమస్యలమీద ధూళికప్పింది. ఇప్పుడు ఈ భాషాభేదం తొలగిపోయి ఒక అధికార భాషవచ్చాక -

ఆ తర్వాత -

రావుగారిది స్త్రీ పక్షపాతమో, జాలియో, సానుభూతో...అది నిర్ణయం అయాక -

అపుడు -

అసలు స్త్రీలకు ప్రత్యేక ప్రాతినిధ్యం ఇవ్వాలా వద్దా అనే సమస్యకు పరిష్కారం...బాబోయ్ - ఎక్కడకు పోతోంది వీళ్ళలో ఆలోచనా శక్తి? కాలం-విలువైన కాలం....అంత అమానుషంగా చంపేస్తోంచే-వీళ్ళకు తేళ్లూ, జెర్రులూ పాకినట్లు ఉండదేం ?

అవసరమైన సంగతి వదలి పక్కదారు తొక్కుతోంచే - వీళ్లది పట్టించుకోరేం ?-

నా కెందుకో బాధగా ఉంది.భయంగా ఉంది.

బాధ - చదువు ఏమయిందో తెలీక ।

భయం - వీళ్లు ఎక్కడికి పోతారో తెలీక ।।

ఈలోపల శాస్త్రి — శాస్త్రి సంగతి నాకు బాగా తెలుసు. అతని ఆలోచనలన్నీ నాకు పరిచయమే । - ఏం చేస్తున్నాడతను ?

ఏవో గోల ... ఆ గోలలో, శాస్త్రి ఏదో అనటం వినిపిస్తోంది.

ముందున్న వ్యక్తిని అడిగాను - ఏం జరిగిందని-

శాస్త్రి ఈ భాషా భేదాలన్నీ వద్దని, వెంటనే చర్చ సమస్య మీద ప్రారంభం చెయ్యమని కోరాడట । బాగుంది ।।

నాకు బాగున్నది అందరికీ ఎందుకు బాగుండాలి ?

అనువాదం కోరిన వ్యక్తి శాస్త్రి మాటలకు గాయపడాడు – ఫలితంగా శాస్త్రి శారీరకంగా బాధపడ్డాడు.

శాస్త్రి మీద మరో రెండు దెబ్బలు–

ఎదుటివాడి మీద ఒకటి ...

కుర్చీ ఎక్కి అందరూ వినోదం చూడటం ప్రారంభించారు.

వెంకటరావు నన్ను చేయిపట్టుకొని బయటకు లాక్కొచ్చాడు – లాక్కొస్తు అన్నాడు – "చెబితే విన్నారుకాదు. ఇది యుద్ధ కాండ అని ; ఇది ఇంకా మొదలు. కొట్టుకోవటం ఇపుడే గదా ఆరంభం – విధ్వంసం అవటం. ఇద్దరో ముగ్గురో బాగా గాయపడటం జరగాలి. అపుడే ఈ సర్వసభ్య సమావేశం జరిగినట్లు..."

"ఎందుకిలా జరుగుతోంది ?" నోరు పెగల్చుకొని అడిగాను వెంకటరావు.

నవ్వాడు పేలవంగా–"ఏం చెప్పను ?– కొందరికి భాషాభిమానం అని చెప్పనా ? కొందరికి కులంపై మమకారం అని చెప్పనా ? మరి కొందరికి మతం అంటే అభిమానం అని చెప్పనా ? ఇవేవీకాక పోతే – ఇంకా కొందరికి పార్టీ అంటే ఇష్టమని చెప్పనా ? – ఏం చెప్పను ?– ఇవన్నీ కొంత నిజాలే అయితే దారుణమైన నిజం ఇంకోటి ఉంది – గెలిచిన వాళ్ళ విజయానికి ఓడిన వారు ఎపుడూ వ్యతిరేకులే గదా ? – అయినా ఇదంతా విషవలయం. ఇక్కడ మీరూ, మీ చదువూ అన్నీ దండుగ – ఈసారి సభలకు రావల్సొస్తే – మీ వెనుక పది మందిని చేకూర్చుకొని రండి. అపుడు మీరన్నది నిజమైనా అసమంజసం అయినా, నీతి అయినా, అవినీతిఅయినా సరే, నెగ్గిపోతుంది. అంతేగానీ"...

– వెంకటరావు ఇంకా అంటూనే ఉన్నాడు.

నా కళ్ళముందు ఇంకా శాస్త్రి – శాస్త్రి తిన్న దెబ్బలు – తింటున్న దెబ్బలు –

ఛీ–చదువుకు సార్థకత లేక ఇంట్లో చదువును పెట్టి వంటినిండా కుసంస్కారం నింపుకొని –విచక్షణా జ్ఞానం విస్మరించి, గుడ్డిగా ఏదో చేలో పడ గొడ్ల లాగా ప్రవర్తిస్తున్న వీళ్ళు...ఏమని పిలవాలి వీళ్ళను ?

వీళ్ళను ఎలా లేపాలి ?

వీళ్ళు పోతున్న నిద్ర ఎప్పటికి పూర్తయేను ?

ఎప్పటికి ఈదేశాన తెల్లవారేను ?

ఈ దారుణానికి – ఒక్కడు వందల మందిని కేవలం తన మూర్ఖపుబలంతో– విచక్షణను చంపేసి, ఆలోచనలను అరికట్టి, నాశనం చేయటం ఎదుర్కోవాలనే కాంక్షతో బయటకు నడిచాను.

ఈ సారి నా ఆలోచనలన్నీ కొత్త దారి పట్టాయి. ●